739) లలిత

ప॥ నీమహి మది యెంత నీవు చేసేచేత లెంత । దీమసపు నీమాయలు తెలియరాదయ్యా ॥

చ॥ నీపాదతీర్థము నెత్తి మోచె నొకడు । పూపకొడుకై యొకడు బొడ్డునబుట్టె ।
యేపున నింతటివారి కెక్కుడైనదైవమవు । మోపుచు ధర్మరాజుకు మొక్కుటెట్టయ్యా ॥

చ॥ నీలీల జగమెల్లా నిండియున్న దొకవంక- । నోలి నీలో లోకా లున్న వొకవంక ।
యేలీలజూచినాను యింతటిదైవమవు । బాలుడై రేపల్లెలో బారాడితి వెట్టయ్యా ॥

చ॥ శ్రీసతికి మగడవు భూసతికి మగడవు । యీసరుస శ్రీవేంకటేశుడవు ।
రాసికెక్కి నీవింతటి రాజసపుదైవమవు । దాసులము మాకెట్ల దక్కితివయ్యా ॥